సాక్షి
ఒడిశా

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,62,663లు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆయుధ పూజ ప్రారంభం

పర్లాకిమిడిలో ఆయుధ పూజ ప్రారంభమైంది. భక్తులు తరలివచ్చారు.

- IIలో



దుర్గాష్టమి పూజలు

జయపురంలో దుర్గాష్టమి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మండపాలన్నీ కళకళలాడుతున్నాయి.

- IIలో

న్యూస్‌రీల్

శ్రీ మందిరం పరిసరాల్లో మద్యం దుకాణాలు నిషేధం



పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుడు కొలువై ఉన్న శ్రీ మందిరం పరిసరాల్లో బొడొదండొ వెంబడి 1 కిలో మీటరు పరిధిలో మద్యం దుకాణాలు, అబ్కారీ సంబంధిత వస్తువుల అమ్మకాలు ఉండవు. అంతే కాకుండా ఈ పరిధిలో మాంసాహార వస్తువుల అమ్మకాలు పరిమితం చేస్తారు. ఆలయం చుట్టూ ఆధ్యాత్మిక పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు.

కొండచిలువ హల్‌చల్



కొండచిలువను పట్టుకున్న ప్రదీప్

రాయగడ: స్థానిక గంగా గ్యారేజీ సమీపంలో సోమవారం రాత్రి భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. గ్యారేజీ సమీపంలో ఆగిఉన్న ఒక లారీలో కొండచిలువ ఉండటం గమనించిన అక్కడి వారు వెంటనే స్నేక్ క్యాచర్ ప్రదీప్ సేనాపతికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సేనాపతి సుమారు గంట సమయం కష్టపడి కొండచిలువను పట్టుకున్నారు. ఆరు అడుగుల పొడవుగల దీనిని సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దసరా కావడంతో లారీని సంబంధిత యజమాని పరిశుభ్రం చేస్తున్న సమయంలో ఛాసీస్ వద్ద దాగిఉన్న కొండచిలువ తారసపడింది.

సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలి



ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మైకులో ప్రచారం చేస్తున్న రైల్వే పోలీసులు

రాయగడ: దసరా సమయంలో ప్రయాణికులతో రైళ్లు రద్దీగా ఉంటాయి. రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు భద్రతతో పాటు సురక్షితంగా తమ గమ్యాలకు చేరుకోవాలంటే అందుకు ఎంతో అప్రమత్తత అవసరమని ఆర్‌పీఎఫ్ అధికారి టి.ఎస్.భంజ్ అన్నారు. జిల్లాలోని మునిగుడ రైల్వే స్టేషన్లో ఈ మేరకు ప్రయాణికులకు అవగాహన, చైతన్య కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైళ్లు ఎక్కేదిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మైకుల ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వివిధ జాగ్రత్తలకు సంబంధించి అవగాహన కల్పించారు. అలాగే రైళ్లలో పరిశుభ్రతను పాటించడం ఆరోగ్యానికి ఎంతోమేలని అందుకు అంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఇద్దరి అరెస్టు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో గొడిగూడకు చెందిన విబుషన్ దొర, నరసింహ దొర ఇద్దరిపై మత్తిలి పోలీస్‌స్టేషన్‌లో 2018లో కేసు నమోదైంది. ఆ సమయంలో ఇద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు. కొన్నాళ్లకు బెయిల్‌పై విడుదలయ్యారు. కోర్టుకు హాజరు కావాల్సిన సమయాల్లో వారు హాజరు కాలేదు. మూడు సార్లు నోటీసులు వచ్చినా హాజరు కాలేదు. దీంతో వారికి అరెస్టు వారెంట్ జారీ చేశారు. మంగళవారం పోలీసులు వారిని అరెస్టు చేశారు.

పాముకాటుతో విద్యార్థి మృతి

జయపురం: పాముకాటుతో ఎనిమిదో తరగతి విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితిలో చోటుచేసుకుంది. బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర గ్రామ పంచాయతీ గోయల్ కుండ గ్రామానికి చెందిన చంద్రసేన్ దురువ (13) తన కుటుంబ సభ్యులతో సోమవారం సాయంత్రం తమపొలంలో మొక్కజొన్న కండెలు తెంచేందుకు వెళ్లారు. చంద్రసేన్ జొన్న పొత్తులు తెంచుతున్న సమయంలో విషసర్పం చ్ చేయివేలుపై కాటువేసింది. దీంతో చంద్రసేన్ పరుగున వచ్చి విషయాన్ని తల్లిదండ్రులకు ఏడుస్తూ చెప్పగా.. వారు వెంటన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి గుణియ వద్దకు తీసుకెళ్లారు. గుణియ చికిత్స చేస్తుండగా అతడు మరణించాడు. సమాచారం అందిన రామగిరి పోలీసు పంటి ఏఎస్‌ఐ విష్ణు మడకామి గోయల్‌కుండ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మూఢనమ్మకాల వల్లే చంద్రసేన్ మరణించాడని స్థానికులు చెబుతున్నారు.

కటక్‌లో పండగ కళ



మంగళా బాగ్ బంగారు మకుట శోభ



చాందినీ చౌక్ రజత ప్రభ



జిగేలుమంటున్న జోబ్రా రజత ప్రభ మండపం



రాణీ హట్‌లో స్వర్ణ మకుటంతో పూజలందుకుంటున్న దేవత



శక్తి స్వరూపిణిగా నిమ్ చౌడీలో పూజలందుకుంటున్న దుర్గా మాత

భువనేశ్వర్: చారిత్రాత్మక నగరం కటక్ శరన్నవరాత్రుల దుర్గా పూజలతో పండగ కళను సంతరించుకుంది. మహానది తీరాన 52 బజార్లు, 53 వీధులతో (బాబొణొ బొజార్ తెప్పొణొ గొలి) ప్రసిద్ధ నగరంగా పేరుగాంచిన కటక్ శతాబ్దాల నాటి సంప్రదాయంతో దేవీ ఉత్సవం కాంతులీనుతుంది. ఈ ఏడాది నగరం అంతటా 176 పూజా మండపాల్లో దుర్గా దేవి నిలువెత్తు విగ్రహాలు తొణికిసలాడుతున్నాయి. 36 మండపాలపై రజత ప్రభలతో ఉత్సవ మూర్తులు ధగేల్‌మంటున్నాయి. వారసత్వంగా కొనసాగుతున్న ఈ కళాఖండాలు కటక్ నగరానికి రజత (వెండి) నగరంగా వన్నె దిద్దాయి. చౌదరి బజార్, షేక్ బజార్, అలీషా బజార్, బాలూ బజార్, చౌలియాగంజ్, చాందినీ చౌక్, శంకర పూర్-బాదంబాడి, కాజీ బజార్, తులసి పూర్, బుఢి ఠాకురాణి, గణేష్ ఘాట్, బఖారా బజార్, ఫిరంగి బజార్, నయాసడక్, కఠొగొడొ సాహి, పితాపూర్ (కలియదలన్), దర్గా బజార్, మచ్చువా బజార్, మంగళా బాగ్, రాణీ హట్, ఛత్ర బజార్, ఖాస్ నగర్, శిఖర్ పూర్, హరిపూర్ - డోలోముండై, బిడానాసి కుంభార సాహి, గంగా మందిర్, కాలేజ్ స్క్వేర్, ఖట్ బిన్ సాహి, కప్లా బజార్, మహ్మదీ బజార్, నిమ్ సాహి, నిమ్ చౌడీ, తులసీ పూర్ మొతొ సాహి, రామ్‌గఢ్ - కనికా చక్, జోబ్రా మరియు గోపాల్‌జీవ్ మొతొ సాహి ప్రాంతాల్లో పూజా మండపాలు వెండి ప్రభలతో శోభిల్లుతున్నాయి. తెలంగా బజార్, బొయాలిష్ మౌజా వద్ద ఇత్తడి ప్రభలు, రౌసపట్న వద్ద మెరిసే గాజు ప్రభలు ఆకట్టుకుంటున్నాయి. మంగళా బాగ్, చౌదరి బజార్ ప్రాంతాల్లో అనేక మండపాల్లో బంగారం పొదుగుతో ఉత్సవ మూర్తుల ఆకర్షణ ద్విగుణీకృతం చేస్తున్నాయి.

ఈనాటిది కాదు ఈ బంధం

దుర్గా పూజతో నగరానికి అనుబంధం శతాబ్దాల నాటిది. 16వ శతాబ్దం ప్రారంభంలో 1514 నాటిదని చెబుతారు. ఆ సమయంలో శ్రీ చైతన్య మహాప్రభు కటక్‌లోని బాలూ బజార్‌లో గడిపిన సందర్భంగా శరదృతువులో దుర్గా మాతను పూజించడం ప్రారంభించారని చారిత్రక రికార్డులు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో మొట్టమొదటి సర్వజనని (సార్వత్రిక) దుర్గా పూజకు అప్పుడే పునాది పడినట్లు పరిగణిస్తారు. బొడొ భౌవుణి (అక్క) గా గౌరవించబడే బినోద్ బిహారీ మండపం ఈ ఏడాది సగర్వంగా 512వ సంవత్సరాన్ని పూర్తి చేసుకుంటుంది, చాందిని చౌక్ పూజను సన్నొ భౌవుణి (చెల్లెలు) గా పేర్కొంటారు. కటక్ నగరంలో దుర్గా పూజల్లో ప్రభలు కాలంతో పాటు అభివృద్ధి చెందాయి. ప్రారంభంలో రంగురంగుల కాగితం, జీలుగు (పిత్) తో రూపుదిద్దుకునే ప్రభలు క్రమంగా జరీ (మెరుపు దారం) తదుపరి దశలో వెండి, బంగారం తీగల అల్లికతో కూడిన (తారాకాసి - ఫిలిగ్రీ) అలంకరణకు ఎదిగాయి.

1956లో జరిగిన చౌదరి బజార్ పూజ ద్వారా మొట్టమొదటి వెండి ప్రభను ప్రవేశపెట్టారు. 1999 నాటికి దేవతను బంగారు కిరీటం అలంకరించి ఏటా జరిగే దేవీ ఉత్సవాలకు బంగారు వన్నె దిద్దారు. చౌదరి బజార్‌లో మాత్రమే, దుర్గ, లక్ష్మి, సరస్వతి, గణేశుడు, కార్తీక, మరియు మహిషాసురుడి ప్రభ, కిరీటాలలో 2.5 క్వింటాళ్ల వెండి, 20 కిలో గ్రాములకు పైగా బంగారం వినియోగిస్తారు. ఏడు దశాబ్దాల క్రితం కటక్‌లో దుర్గా పూజ నామమాత్రంగా డజను (12) ప్రాంతాలకు పరిమితం కాగా నేడు దాదాపు 200 పూజా మండపాలతో నగర వ్యాప్తంగా వేడుక జరుగుతోందని కటక్ మహానగర్ శాంతి కమిటీ ప్రధాన కార్యదర్శి భికారి దాస్ తెలిపారు. 1983లో జిల్లా మేజిస్ట్రేట్ ప్యారీ మోహన్ మహాపాత్రో ఆధ్వర్యంలో కటక్ మహానగర్ శాంతి కమిటీ ఏర్పడటం వల్ల నగరంలో పూజలు సామరస్య భావాల పరిరక్షణతో ఏటా దేవీ పూజోత్సవాలు శాంతియుతంగా కొనసాగుతున్నాయి. పూజా ప్రాంగణాల్లో విద్యుద్దీప అలంకరణలు నడుమ బంగారు, వెండి, ఇత్తడి, గాజు తదితర ప్రభలతో రూపుదిద్దుకున్న దేవీ విగ్రహాలు వెలుగులు విరజిమ్ముతున్నాయి.

నవ్వు ఆరోగ్యానికి ఎంతో మేలు



నవ్వుతూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న లాఫర్స్ క్లబ్ సభ్యులు

రాయగడ: నవ్వు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తోందని స్థానిక ప్రేమ్ పహాడ్ లాఫర్స్ క్లబ్ సభ్యులు అన్నారు. ఈ మేరకు చెక్కాగుడలోని ప్రేమ్ పహాడ్ వద్ద మంగళవారం ఉదయం నిర్వహించిన నవ్వుల కార్యక్రమంలో అంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బాబూరావు మహంతి మాట్లాడుతూ.. మన నిత్యజీవితంలో నవ్వు ఎంతో అవసరమని అన్నారు. ఎప్పుడూ ఒత్తిడితో ఉండే మనం నవ్వు వల్ల ఉపశమనం పొందవచ్చని అభిప్రాయపడ్డారు. అందువల్ల ప్రతిఒక్కరూ కొద్ది సమమైన నవ్వడం, నవ్వించడం వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. నవ్వువల్ల కలిగే అనేక ప్రయోజనాల గురించి వివరించారు. తమ క్లబ్ మంచిలక్ష్యంతో ముందుకు సాగుతోందని అన్నా రు. అందరినీ ఆనందంగా ఉంచడం, నవ్వించడం వంటి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరిచి పలు కార్యక్రమాలను చేపడుతుందని అన్నారు. భవిష్యత్ ప్రణాళికల గురించి అనంతరం చర్చించారు. కార్యక్రమంలొ క్లబ్ ఉపాధ్యక్షులు ఎ.మహంతి, సలహాదారుడు ఉదయ్ పండ పాల్గొన్నారు.

అలరించిన నాటకం



నాటకంలో పాల్గొన్న కళాకారులు



నాటకంలో ఒక సన్నివేశం

రాయగడ: స్థానిక రాణిగుడ ఫారం వద్ద న్యూటౌన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి మూ కొహుచి సామోయొ అనే నాటకం ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఆద్యంతం రసభరితంగా సాగిన ఈ నాటకం రాజకీయ పరిణామాలకు సంబంధించి ఇమిడి ఉన్న ఈ నాటక సన్నివేశాలతో ప్రేక్షకులను కట్టిపడేసింది. సమయానికి ఎవరూ అతీతులు కారన్న ముఖ్య సందేశంతో కొనసాగిన ఈ నాటకంలో విద్యావేత్త డాక్టర్ డీకే మహంతి, బ్రజసుందర్ నాయక్, ప్రముఖ హాస్యనటుడు ప్రభాకర్ మిశ్రొ (టున్నా టన్ టన్), డాక్టర్ రాజేష్ కుమార్ పాఢి, శివ మిశ్రొ, డాక్టర్ ద్వితీ చంద్ర సాహు, బాబులాల్ గంతాయిత్, అజిత్ కుమార్ పాణిగ్రాహి, రవి సతపతి, మానస్ రొథొ, ప్రణతి పాత్రొ, భవాని మిశ్రొ తదితర కళాకారులు పాల్గొన్నారు.



ప్రేక్షకులు

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు



రక్తదానం చేసిన యువకులకు ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక

రాయగడ: రక్తదానం చేయడంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని, యువత అపోహలు వీడి రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక పిలుపునిచ్చారు. సదరు సమితి జేకేపూర్‌లో గల టీమ్ కణ్యారాశింభ్ అనే సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రక్తదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను తరచూ నిర్వహించాలని సూచించారు. ఈ శిబిరంలో 42 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తాన్ని దానం చేయడం అభినందించాల్సిన విషయమన్నారు. అనంతరం వారికి సంస్థ సమకూర్చిన ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ సభ్యులు పట్నాన గౌరి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి రక్తనిధి అధికారుల పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు.

మహానదిలో విద్యార్థి గల్లంతు



సహాయక బృందాల గాలింపు



గల్లంతు అయిన విద్యార్థి

భువనేశ్వర్: మహానదిలో స్నానం చేస్తూ 10వ తరగతి విద్యార్థి గల్లంతయ్యాడు. కటక్ జిల్లా అఠొగొడొ పోలీస్ ఠాణా పరిధిలోని దాస్‌పూర్‌లోని మహా నది తీరంలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానిక అగ్నిమాపక, ఓడీఆర్ఏఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు.

రైలు టాయిలెట్‌లో మహిళ ప్రసవం



రైలు టాయ్‌లెట్‌లో జన్మించిన ఆడబిడ్డ



రైలు నుంచి బాలింత సురక్షిత తరలింపు

భువనేశ్వర్: నాగర్ కోయెల్-షాలిమార్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ రైలు 6వ నంబర్ బోగీలో ఒక ప్రయాణికురాలు టాయిలెట్‌లో ఆడ బిడ్డను ప్రసవించింది. అనంతరం అపస్మారక స్థితిలోకి జారుకుంది. స్థానిక ఖుర్దా రోడ్ రైల్వే స్టేషన్‌లో ఆపరేషన్ మాతృ శక్తి కార్యక్రమం కింద తక్షణ చర్యలు చేపట్టడంతో తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. ఆపరేషన్ మాతృ శక్తి బృందం స్థానిక జట్నీ సామూహిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స తర్వాత, తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. దీంతో ఆపరేషన్ మాతృ శక్తి కార్యక్రమం విజయవంతమైంది. మంగళవారం ఉదయం 5 గంటలకు భార్య ప్రసవ వేదన గమనించిన భర్త రైల్వే హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో రైల్వే యంత్రాంగం తక్షణమే స్పందించి ఉదయం 6 గంటల ప్రాంతంలో గురు దేవ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఖుర్దారోడ్ స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫామ్‌కు చేరే సరికి అంబులెన్స్, వైద్య బృందాన్ని సిద్ధంగా ఉంచింది. మహిళా చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ లిల్లీ బరువా, ఇతిశ్రీ మిశ్రా, రైల్వే రక్షక దళం మహిళా కానిస్టేబుళ్లు ఎస్.స్వాతి, రీతా దాష్, బి.ఎల్. జెనా, ఒక వైద్య బృందం స్ట్రెచర్ సాయంతో టాయ్‌లెట్ నుంచి బాలింత, శిశువుని సురక్షితంగా కిందకు దించి స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బీహార్ ముంగేర్ జిల్లా గోబడా నివాసి చంపా దేవి (31) 12659 డౌన్ నాగర్‌కోయిల్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్ రైలులో షాలిమార్‌కు ప్రయాణిస్తోంది. మార్గమధ్యంలో ఆమె భర్త జితేంద్ర కుమార్ దాష్ ప్రసవ వేదన గమనించి రైల్వే శాఖ ఉద్యోగుల మద్దతుతో తల్లీబిడ్డల్ని ఆదుకోగలిగారు. ఈ సందర్భంగా అతడు రైల్వే సిబ్బంది సేవా స్ఫూర్తిని అభినందించారు. ఆపరేషన్ మాతృ శక్తి బృందంలో ఉద్యోగుల మనోధైర్యాన్ని పెంచడానికి ప్రత్యేక అవార్డులతో అభినందించాలని తూర్పు కోస్తా రైల్వే శ్రామిక కాంగ్రెస్ శాఖా కార్యదర్శి లక్ష్మీధర మహంతి అధికార వర్గాలకు విజ్ఞప్తి చేశారు.

దక్షిణకాళీ మందిరం పరిశుభ్రం



ఆలయాన్ని పరిశుభ్రం చేస్తున్న శ్రీరామ సేవా కమిటీ సభ్యులు



ఆలయంలో పరిశుభ్ర పరుస్తున్న కార్యదర్శి జగదీస్, తదితరులు



దక్షిణకాళీ మందిరానికి వచ్చిన గ్రామ దేవతల లాఠీలను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

జయపురం: దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ ప్రజల ఆరాధ్య దేవతల్లో ఒకరు పూర్ణఘడ్‌లో వేంచేసి ఉన్న దక్షిణకాళీ మందిరాన్ని ప్రతీరోజు స్థానిక శ్రీరామ సేవా కమిటీ సభ్యులు పరిశుభ్రం చేస్తున్నారు. అంతే కాకుండా ఆలయంలో మా దక్షిణకాళీకి సేవలు చేస్తున్నారు. శ్రీరామ సేవా కమిటీ కార్యదర్శి సానా జగదీస్ నేతృత్వంలో ప్రతీరోజు ఉదయం వచ్చి ఆలయాన్ని పరిసర ప్రాంతాలను పరిశుభ్ర పరుస్తున్నారు. కార్యదర్శి జగదీస్ మంగళవారం సాక్షితో మాట్లాడుతూ దక్షిణ కాళీ మందిరానికి ప్రతీరోజు వందలాది మంది భక్తులు వస్తున్నారని, భక్తులకు అసౌకర్యం కలుగ కుండా శ్రీరామ సేవా కమిటీ సభ్యులతో దసరా ఉత్సవాలు ముగిసేంత వరకు ప్రతీరోజు ఉదయం 6 గంటలకు వచ్చి పరిశుభ్ర పరుస్తున్నామని వెల్లడించారు. భక్తులకు అవసరమైన సేవలు అందిస్తున్నామన్నారు. మంగళవారం దక్షిణ కాళీ ఆలయానికి వచ్చిన గ్రామ దేవతల లాఠీలకు శ్రీరామ సేవా కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బవిరెడ్డి రమణ, ఎ.తిరుమల రావు, ఎస్.మల్లికార్జున రావు, బి.గుప్తేశ్వర రావు, బాబూరావు, సీతారాం, పి.రవి, వి.రామారావు, పట్నాన ప్రతాప్, జి.వెంకట రమణ, జి.రమణ, జి.శ్రీలత, వి.మల్లేశ్వరి, ఎస్.రేవతి. వి.పద్మ, ఎన్.స్వాతి, పావని, జి.భవాని, పి.మాధురి, జి.శ్రీలత, పి.అరుణ పాల్గొన్నారు.



దక్షిణ కాళీ మందిరంలో సేవలు అందిస్తున్న కమిటీ సభ్యులు

క్లుప్తంగా

తీరంలో మృతదేహం

సంతబొమ్మాళి: పిట్టవానిపేట సముద్రతీరానికి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం సాయంత్రం కొట్టుకొచ్చింది. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఒకటి రెండు రోజుల కిందట సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతై ఉంటారని స్థానిక మత్స్యకారులు భావిస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల : తోటపాలెం పంచాయతీ అఖింఖాన్‌పేట శివారులో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5 వేలు నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినోద్‌కుమార్ తెలిపారు.

ఘనంగా కొత్తమ్మ తల్లి మారువారం



పూజలందుకుంటున్న అమ్మవారు

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఆలయంలో మంగళవారం మారువారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తులంతా ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముర్రాటలతో చల్లదనం చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

స్త్రీ శక్తి పథకం ద్వారా రూ.51 కోట్లు భారం

టెక్కలి: ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకం దిగ్విజయంగా కొనసాగుతోందని, ఈ పథకం ద్వారా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం జిల్లాల్లో నెలకు సుమారుగా రూ.51 కోట్లు భారం పడుతోందని ఆర్టీసీ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ 6 జిల్లాల్లో 1610 బస్సులు ఉన్నాయని వాటిలో స్త్రీ శక్తి పథకానికి 1352 బస్సులను కేటాయించినట్లు పేర్కొన్నారు. కొత్తగా బస్సులు పెంచే ఆలోచన ప్రభుత్వ విధానం పై ఆధారపడి ఉంటుందని ఈడీ వెల్లడించారు. మారుమూల ప్రాంతాల్లో ఒక సారి రద్దయిన బస్సులను మళ్లీ పునరుద్ధరణ చేయడం కష్టతరమన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లను బీఓటీ పద్ధతి ద్వారా ఆధునీకరణ చేయడానికి చర్యలు చేపడుతున్నామని ఈడీ పేర్కొన్నారు. ఐటీఐలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ఫిట్టర్ తదితర కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగులకు అప్రెంటిస్ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఈడీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 154 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రమాదంలో మరణిస్తే రూ.1.10 కోట్ల పరిహారం అందజేస్తామని, సాధారణంగా మరణిస్తే రూ.10 లక్షలు అందజేస్తామని వెల్లడించారు. ఆయనతో పాటు డీపీటీఓ సీహెచ్ అప్పలనారాయణ, డీఈ రవికుమార్, డీఎం ఎం.శ్రీనివాస్ ఉన్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా



కరపత్రం విడుదల చేస్తున్న ఫ్యాప్టో ప్రతినిధులు

శ్రీకాకుళం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా ఈ నెల 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకుడు కె.భానుమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాకుళం ఎన్‌జీఓ భవన్‌లో ఫ్యాప్టో చైర్మన్ బమ్మిడి శ్రీరామమూర్తి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి తప్పించడం, మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతి మంజూరు, మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ వంటి హామీలు కాలేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లు ఏటా రూ.180 కోట్లు హెల్త్‌కార్డుల కోసం చెల్లిస్తున్నా ఆస్పత్రులు అంగీకరించడం లేదన్నారు. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా, అంతర్ జిల్లా బదిలీల్లో స్పౌజ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ పడాల ప్రతాప్‌కుమార్, కార్యవర్గ సభ్యులు జి.రమణ బి.వెంకటేశ్వర్లు వి.సత్యనారాయణ, కుప్పిలి జగన్మోహన్, చావలి శ్రీనివాస్, వి.నవీన్‌కుమార్, వి.రామారావు, పి.హరిప్రసన్న, టి.శ్రీనివాసరావు, డి.రామ్మోహన్ డి.వెంకటేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి పూజలు



పనసపుట్‌బగర పర్వతంపై మా దుర్గ దేవి పీఠం



దక్షిణ కాళికి పూజ, భోగం సామానులు తీసుకువస్తున్న పనసపుట్‌బగర బాలికలు



బగర పర్వతంపై పూజలందుకుంటున్న మా దుర్గ దేవి

జయపురం: జయపురం చారిత్రాత్మక దసరా ఉత్సవాల్లో ప్రధాన దేవతల్లో ఒకరు పూర్ణఘడ్‌లో వేంచేసి ఉన్న మా దక్షిణ కాళీ జన్మస్థలం పనసపుట్‌బగరలో మంగళవారం ఘనంగా దుర్గాష్టమి పూజలు జరిగాయి. జయపురం పట్టణానికి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న పనసపుట్‌బగర గ్రామం సమీప కొండపై పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్న ప్రసాద సేవన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కాళీ మాత చెల్లి దుర్గా మాతకు ప్రజలు అష్టమి పూజలు జరిపి దసరా వేడుకలు జరపటం కొన్ని శతాబ్దాల కాలం నుంచి వస్తున్న సాంప్రదాయమని ఆ గ్రామంలో ముఖ్య వ్యక్తి సరోజ్ మహంతి వెల్లడించారు. రెండు వందల సంవత్సరాలకు పూర్వం గ్రామం సమీప పర్వతంపై ఇద్దరు అక్క చెల్లెల్లు దుర్గ, దక్షిణ కాళీలను అనాదిగా ఆ ప్రాంత ప్రజలు కొలుచేవారు. ఏ కారణం చేతనో జయపురం పట్టణంలో ఖడంగా కుటుంబానికి గ్రామస్తులు దక్షిణ కాళీ విగ్రహాన్ని విక్రయించారు. ఖడంగా కుటుంబం దక్షిణ కాళీ విగ్రహాన్ని తమ ఇంటికి తీసుకెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలు చేసేవారు. కొంత కాలం తరువాత ఖడంగా కుటుంబ సభ్యులు దక్షిణ కాళీ విషయం జయపురం రాజుకు తెలియజేశారు. ఆ సమయంలో నక్కిడొంగర పర్వతంపై కోట నిర్మించి అక్కడ నుంచి జయపురం రాజులు పాలించేవారు. అందువల్ల ఆ ప్రాంతంలో (నేటి పూర్ణఘడ్) ఒక గుడిశ నిర్మించి అందులో దక్షిణ కాళీ విగ్రహాన్ని అప్పటి రాజు ప్రతిష్టించారు. అప్పటి నుంచి పూర్ణఘడ్‌లో మా దక్షిణ కాళీ, పనసపుట్‌బగరా పర్వతంపై మా దుర్గదేవి పూజలు అందుకున్నారు. పనసపుట్‌బగరలోగల మా దుర్గా దేవికి మంగళవారం, శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. దక్షిణ కాళీ, మా దుర్గ దేవత మూర్తులకు దసరా వేడుకల్లో ఘనంగా పూజలు, ఉత్సవాలు జరుపుతూ వస్తున్నారు. మంగళవారం పనసపుట్ బగరా పర్వతంపై అంగరంగ వైభవంగా పూజలు జరిపారు. అనాదిగా వస్తున్న సాంప్రదాయం ప్రకారం పనసపుట్ బగర గ్రామం నుంచి ఆ గ్రామ యువకులు, బాలికలు పూజా, భోగానికి సామగ్రి తీసుకువచ్చి దక్షిణ కాళీ మాతకు సమర్పించిన తరువాత దక్షిణ కాళీ ఆలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయని గ్రామస్తులు వెల్లడించారు. ఈ ఆచారం రాజుల కాలం నుండి వస్తుందని వెల్లడించారు. కాల క్రమేణా రాజుల పర్యవేక్షణంలో దక్షిణ కాళీ మందిరం అభివృద్ధి చెందినా పనసపుట్‌బగర పర్వతంపై ఉన్న దుర్గా మాత పీఠం అభివృద్ధికి నోచుకోక లేకపోయిందని గ్రామ పెద్దలు తెలిపారు.

ఒడిశా వననిగమ్ ఆధ్వర్యంలో పూజలు



మునిగుడలో దసరా సంబరాలు



పూజా పెండాల్



రాధాకృష్ణ మందిరం ప్రాంగణంలో అమ్మవారు



వననిగమ్ ఏర్పాటు చేసిన పూజా మండపం

రాయగడ: జిల్లాలోని మునిగుడలో దసర సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. రాధాకృష్ణ మందిరం ప్రాంగణంలో ఒడిశా వననిగమ్ ప్రాంతాల్లో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారికి అష్టమి పూజలు చేశారు. పూజా పెండాళ్లు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మునిగుడ సమీపంలోని గ్రామాల నుంచి ప్రజలు దసరా సంబరాలను చూసేందుకు తరలి వస్తున్నారు.

ప్రత్యేక పూజలు..



పపడాహండి వద్ద ఏర్పాటైన భారీ స్వాగత పెండల్



నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో బండారు ఘరణి శక్తి పీఠంలో పారాయణం చేస్తున్న తెలుగు మహిళలు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో ఏకైక శక్తి పీఠం మా బండారు ఘరణి దేవాలయంలో తెలుగు మహిళలు పారాయణం, ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జ్యోతిర్మయి ఆధ్యాత్మిక సంస్థ మహిళల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం ప్రాంగణంలో మా బండారు, మా పెంద్రాణి అమ్మవారి దేవాలయాల మధ్య పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన సుమారు వంద మంది మహిళలు కాషాయ చీరలు ధరించి మంత్రాలు పఠించారు. ఇదే సమయంలో దేవాలయానికి వచ్చిన బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి మహిళలను అభినందించారు. సుమారు 15 ఏళ్లుగా జ్యోతిర్మయి మహిళలు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పారాయణం చేస్తున్నారు. మరోవైపు పపడాహండి సమితి కేంద్రంలో దసరా సందర్భంగా ఏర్పటు చేసిన పెండళ్లు ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

అంగరంగ వైభవంగా ..



పలు రూపాల్లో వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



కళింగ వైశ్య సంఘం మహిళల నృత్యాలు



అమ్మోరు పాటకు నృత్యం చేస్తున్న మహిళలు



చండీయోగంలో పాల్గొన్న ఎరుకోల కృష్ణారావు దంపతులు

పర్లాకిమిడి: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కళింగ వైశ్య సంఘం మహిళలు దేవీ నవరాత్రులు సందర్భంగా కూచిపూడి, అమ్మోరు, బతుకమ్మ నృత్యాలు, గుజరాతి దాండియా నృత్యాలతో అలరించారు. మంగళవారం కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పాతపట్నానికి చెందిన ఎరుకోల కృష్ణారావు దంపతులు చండీ యోగంలో పాల్గొన్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కూడా అన్నప్రసాద సేవనానికి విచ్చేశారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

- రాజ భవనాలు తిలకించేందుకు పోటెత్తిన జనం



కోటలో పూజలు అందుకుంటున్న మరఫిరంగులు



రాజులకోట అందాలను తిలకిస్తున్న జనం

జయపురం: దసరా ఉత్సవాల సందర్భంగా అందంగా అలంకరించిన జయపురం మహారాజ భవనాలను తిలకించేందుకు జనం పోటెత్తాన్నారు. సోమవారం సాయంత్రం వందలాది మంది ప్రజలు రాజ భవనాలను సందర్శించారు. కోటలో పల మరఫిరంగులను తిలకించారు. రాజుల యుద్ధ సమయంలో శత్రువులను వధించడానికి వినియోగించే ఫిరంగులకు గుడి కట్టి పూజలు జరుపుతున్నారు. ఆ ఫిరంగులు తిలకించి ప్రజలు పూజిస్తున్నారు. సోమవారం సాయంత్రం తరువాత జయపురం రాజ కుమారుడు బిశ్వంబర చంద్ర చూడదేవ్ దసరా ఉత్సవాల్లో భాగంగా రాజులు ధరించే దుస్తులతో ప్రజలకు దర్శనం ఇచ్చారు. అతనికి ప్రత్యేక ఛత్రం(గొడుగు) పట్టి యువత ఆయనతోపాటు నడిచారు. యువ రాజుని చూసేందుకు ప్రజల పోటెత్తగా.. యువకులు అతని చుట్టూ రక్షణ వలయంగా నిలిచి ముందుకు తీసుకువెళ్లారు.

బాహినీ ఆయుధ పూజ ప్రారంభం

- దేవీ మండపాలకు పెరిగిన భక్తుల తాకిడి



పర్లాకిమిడి బెబర్తా వీధిలో కృష్ణచంద్రగజపతి సమర యోధుల వాహినీ ఆయుధపూజ



కటిక వీధిలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

పర్లాకిమిడి: స్థానిక బెబర్తా వీధిలోని శ్రీకృష్ణచంద్ర గజపతి సమరయోధుల వాహినీ దుర్గాష్టమి సందర్భంగా ఆయుధపూజను మంగళవారం ప్రారంభించారు. అప్పటి పర్లాకిమిడి మహారాజు గౌరచంద్ర గజపతి నారాయణ దేవ్ కాలం నాటి కత్తులు, డాలు, సమరయోధులు కర్ర తిప్పడం వంటి నైపుణ్య విన్యాసాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. అష్టమి నుంచి ఈ ఆయుధాలను బయటకు తీసి పూజను ప్రారంభించి విజయదశమి రోజున బెబర్తా వీధి, కటిక వీధి, చిత్రకార వీధిలో వున్న సమరయోధులు పర్లాకిమిడి పురవీధులు, మహారాజా ప్యాలస్ వద్ద విన్యాసాలు చేస్తారు. అప్పట్లో మహారాజులు ఈ విన్యాసాలు చూసి వారికి నగదు బహుమతులు అందించేవారు. కాలానుకూలంగా రాజులకాలం పోయి సమరయోధులు యుద్ధవిన్యాసాలు గజపతి జిల్లాలో ప్రదర్శిస్తుంటారు. కాగా మంగళవారం అన్ని దేవీ పెండాళ్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. దీంతో పోలీసులను ప్రతి జంక్షన్ వద్ద మోహరించి ట్రాఫిక్ సమస్యలేకుండా చేశారు. కటిక వీధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అష్టమి నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.



బెబర్తా వీధిలో ఆయుధపూజ జరుపుతున్న గజపతి సమరయోధులు



ఆయుధపూజ సందర్భంగా డప్పులు వాయిస్తున్న కళాకారులు

భారత జట్టుకు సైకత శుభాకాంక్షలు



మానస కుమార్ సాహు రూపకల్పనలో భారత్ జట్టు శుభాకాంక్షల సైకత యానిమేషన్

భువనేశ్వర్: ఆసియా కప్‌ను టీమిండియా గెలిచింది. ఈ సందర్భంగా అంతర్జాతీయ సైకత కళాకారుడు మానస్ కుమార్ సాహు సైకత యానిమేషన్ ద్వారా భారత్ జట్టుకు అభినందించారు. దీనిలో భారత్ జట్టు క్రీడాకారులతో ఏషియా కప్‌ని చిత్రీకరించాడు. దీని కోసం 2 గంటలపాటు నిర్విరామంగా శ్రమించినట్లు మానస కుమార్ సాహు తెలిపాడు.

8 అడుగుల కొండచిలువ పట్టివేత



కొండచిలువతో రాకేష్ హల్దార్

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి ఇరిగేషన్ కాలనీలో సోమవారం రాత్రి పది గంటల సమయంలో తులారామ్ హరిజన్ ఇంటి పెరట్లోకి ఎనిమిది అడుగుల కొండచిలువ చొరబడింది. దీన్ని చూసిన కుటుంబ సభ్యులు స్నేక్ హెల్ప్‌లైన్ సభ్యుడు రాకేష్ హాల్దార్ సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పామును అతికష్టంపై పట్టుకున్నారు. సమీపంలోని కొండల్లో నుంచి వచ్చిన కొండచిలువ కోళ్లను తినేసి ఉందని స్నేక్‌క్యాచర్ చెప్పారు. మంగళవారం ఉదయం అటవీశాఖ సిబ్బంది సూచనలతో తిరిగి అటవీ ప్రాంతంలో పామును విడిచిపెట్టారు.

చండీయాగంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు



చండీయాగం..

పర్లాకిమిడి: బీజేపీ మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు మంగళవారం వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో నిర్వహించిన చండీయాగంలో పాల్గొన్నారు. పాతపట్నానికి చెందిన ఎరుకోల కృష్ణారావు దంపతులు పూర్ణాహుతిని సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే కోడూరును కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు, జిల్లా సినీ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైశ్యరాజు బాలాజీ రాజు పట్టువస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రధాన పూజారి వనమాలి మణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.



కోడూరు నారాయణరావును సత్కరిస్తున్న జిల్లా ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలాజీ రాజు

అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలు

రాయగడ: అంబులెన్స్ ఢీకున్న ఘటనలో బైక్ చోదకునికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణానికి చెందిన యువకుడు రాజేష్ కుమార్ పాఢి బైకుతో వస్తుండగా లక్ష్మీపూజ కూడలిలో ఎదురుగా వచ్చిన అంబులెన్స్ బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో బైకు ముందు భాగం నుజ్జునుజ్జవ్వగా రాజేష్ తీవ్రగాయాలకు గురై ఆపస్మారక స్థితిలో పడిపాయాడు. అక్కడి వారు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సదరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలతో చికిత్స పొందుతున్న రాజేష్



బైకును ఢీకొన్న అంబులెన్స్

క్లుప్తంగా

పైడితల్లి జాతరకు 2,300 మందితో బందోబస్తు


వన్‌టౌన్ సీఐ ఆర్వీఆర్‌కేచౌదరి

విజయనగరం క్రైమ్: విజయనగరంలో శ్రీశ్రీశ్రీ పైడితల్లి అమ్మవారి జాతరకు 2, 300 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాట్లకు ఎస్పీ, ఏఎస్పీ, ఏఆర్ ఏఎస్పీలు రంగంలోకి దిగారు. గతేడాది లాగానే ఈ ఏడాది కూడా మధ్యాహ్నం ఒంటిగంట, రెండు గంటల మధ్యలో నగరంలోని హుకుంపేట నుంచి సిరిమాను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లలో పోలీసులు నిమగ్నమయ్యారు.

బందోబస్తు బాధ్యత మాదే

జాతరకు బందోబస్తుకు వస్తున్న 2,300 మంది సిబ్బందిని బాధ్యత మాదే. తొలేళ్ల,సిరిమాను జాతరకు వస్తున్న సిబ్బందికి ఏ లోటూ రాకుండా చూస్తున్నాం. ఎస్పీ ఆదేశాలతో మన్యం, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి బందోబస్తు కోసం వస్తున్న సిబ్బంది బాధ్యత వన్ టౌన్ పోలీస్ స్టేషన్ తీసుకుంది.

4న దివ్యాంగ క్రీడాకారులకు ఈత పోటీలు

విజయనగరం: పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో అక్టోబర్ 4న దివ్యాంగ క్రీడాకారులకు ఈత పోటీలు నిర్వహించనున్నారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ 4న విశాఖపట్నంలోని జీవీఎంసీ ఆక్వా స్పోర్ట్స్ ఈత కొలనులో జరగనున్న ఈ పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆసక్తి గల దివ్యాంగ క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచినవారు అదే నెల 12న ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 9849377577 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


అప్పలమ్మ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని బూసాయవలస జంక్షన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలం పరిధిలోని కొండ కెంగువ గ్రామానికి చెందిన రాజమహేంద్ర అప్పలమ్మ(65) మెంటాడలో ఉన్న కుమార్తె ఇంటి వెళ్లి తిరిగి వస్తూ ఇదే మండలంలోని మామిడివలస గ్రామం వెళ్దామన్న ఉద్దేశంతో బూసాయవలస జంక్షన్ వద్ద బస్సు దిగింది.ఇంతలో విజయనగరం నుంచి రామభద్రపురం వైపు వస్తున్న కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం స్థానిక క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి మనుమడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై మహిళ ఫిర్యాదు

గంట్యాడ: నువ్వే ప్రాణం, నువ్వు లేకపోతే బతకలేను అని నమ్మించాడు. దీంతో అమహిళ ఆ వ్యక్తికి శారీరకంగా దగ్గరైంది. కోరిక తీర్చుకున్నాడు. సదరు యువతి పెళ్లి చేసుకోమంటే నిరాకరిస్తున్నాడు. అంతటితో అగకుండా ఎక్కువగా మాట్లాడితే మంత్రితో చెప్పి అంతమొందిస్తానని బెదిరిస్తుండడంతో బాధిత మహిళ ఎస్పీకి మంగళవారం ఫిర్యాదు చేసింది. గంట్యాడ మండలం లోని బుడతానపల్లి గ్రామాని చెందిన ఓ యువతి వెంట అదే గ్రామానికి చెందిన బమ్మిడి పరశురామ్ అనే వ్యక్తి మూడేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ వెంటబడ్డాడు. అమెకు కల్లబొల్లి మాటలు చెప్పడంతో నమ్మిన యువతి తిరిగి ప్రేమించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలకడంతో శారీరకంగా కూడా ఒక్కటయ్యారు. తీరా పెళ్లి చేసుకోమని యువతి అడగడంతో నిన్ను వాడుకోవడానికే తప్ప పెళ్లి చేసుకోనని తెగేసి చెప్పేశాడు. ఇంకా ఎక్కువ చేస్తే నాకు మంత్రి అండదండలు ఉన్నాయి, నిన్ను లేపేస్తానని బెదిరించడంతో బాధిత యువతి ఎస్పీ దామోదర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ చేయాలని గంట్యాడ పోలీసులను ఎస్పీ ఆదేశించారు.

కేసు నమోదులో పోలీసుల జాప్యం..!


బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యువతి ఫిర్యాదు చేసిన వ్యక్తిని పోలీసులు ఇంతవరకు విచారణకు కూడా పిలవలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదరు వ్యక్తికి అధికార పార్టీ అండదండలు ఉండడంవల్లే పోలీసులు కేసు నమోదుకు వెనుకాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పారాది కాజ్‌వేపై వరద నీరు

బొబ్బిలిరూరల్: అంతరరాష్ట్ర రహదారిలో పారాది గ్రామం వద్ద వేగావతినదిపై నిర్మించిన తాత్కాలిక కాజ్‌వేను మంగళవారం వరద నీరు ముంచెత్తింది. నదీ పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు వేకువజాము నుంచి కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం ఏడు గంటలకు వరదనీరు తగ్గుముఖం పట్టడంతో ఆర్అండ్‌బీ అధికారులు వాహనాల రాకపోకలకు అనుమతించారు.

ఆపద్బాంధవులు

- ప్రాణాలు నిలబెడుతున్న రక్తదాతలు
- పార్వతీపురం మన్యం జిల్లాలో 1682 మంది స్వచ్ఛంద రక్తదానం
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



పార్వతీపురం రూరల్/రాజాం సిటీ: మనిషి ప్రాణానికి ప్రత్యామ్నాయం లేదు. అలాగే మనిషి రక్తానికి మరో ప్రత్యామ్నాయం లేదు! ఆధునిక విజ్ఞానం ఎంత అభివృద్ధి సాధించినా, ప్రయోగశాలల్లో రక్తాన్ని సృష్టించలేని పరిస్థితి. అందుకే, ఒకరి ప్రాణాన్ని కాపాడాలంటే మరొకరు అందించే రక్తమే ఏకైక ఆధారం. ఆపదలో ఉన్నవారికి ప్రాణభిక్ష పెట్టే ఆ మహత్తర కార్యానికి గుర్తుగా, ప్రజల్లో చైతన్యం నింపే లక్ష్యంతో ఏటా అక్టోబర్ 1వ తేదీన 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం' జరుపుకుంటున్నాం. పార్వతీపురం మన్యం జిల్లాలో దాదాపు 1682 మంది స్వచ్ఛంద ప్రత్యక్ష రక్తదాతలు ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి వారిని గుర్తు చేస్తూ వారిని ఆదర్శంగా తీసుకునే ప్రత్యేక రోజు కేవలం ఒక దినోత్సవం కాదు, మానవత్వం పరిమళించే ఒక మహాయజ్ఞం.

ప్రాణం నిలిపే అమృతధార

ప్రతిరోజూ మన దేశంలో వేలాది మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రసవ సమయంలో తల్లీబిడ్డలు రక్తహీనతతో ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. తలసేమియా, కేన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే చిన్నారులు, రోగులకు క్రమం తప్పకుండా రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటుంది. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో, దాతలు అందించే ప్రతి రక్తపు చుక్క ఓ అమృతధారలా మారి ప్రాణాలను నిలుపుతుంది. మన దేశంలో ఏటా సుమారు 1.2 కోట్ల యూనిట్ల రక్తం అవసరం ఉండగా, స్వచ్ఛంద దాతల ద్వారా కేవలం 90 లక్షల యూనిట్లు మాత్రమే అందుతోందని రక్తదాతలు, వైద్యులు చెబుతున్నారు. ఈ అంతరాన్ని పూడ్చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

అపోహల తెరలను చీల్చుదాం

రక్తదానం అనగానే చాలామందిలో అపోహలు, అనవసర భయాలు గూడుకట్టుకుని ఉంటాయి. 'రక్తదానం చేస్తే నీరసించిపోతాం, అనారోగ్యం పాలవుతాం' వంటివి కేవలం నిరాధారమైన ప్రచారాలు మాత్రమే. వాస్తవాలను పరిశీలిస్తే..

రక్తం ఇస్తే నీరసం వస్తుందా?

మన శరీరంలో సగటున 5–6 లీటర్ల రక్తం ఉంటుంది. దానం చేసేది కేవలం 350 మిల్లీలీటర్లు మాత్రమే. ఈ కొద్దిపాటి రక్తాన్ని మన శరీరం కేవలం 24 నుంచి 48 గంటల్లోనే తిరిగి ఉత్పత్తి చేసుకుంటుంది. ఎలాంటి నీరసం రాదు.

రక్తదానం వల్ల ఇన్ఫెక్షన్లు సోకుతాయా?

రక్త సేకరణ ప్రక్రియ అత్యంత సురక్షితమైనది. ప్రతి దాతకు కొత్త, స్టెరిలైజ్డ్ సూదిని మాత్రమే ఉపయోగిస్తారు. దీనివల్ల దాతకు ఎలాంటి ఇన్ఫెక్షన్ సోకే అవకాశమే లేదు.

దాతలే హీరోలు..

రక్తదానం చేయడానికి ప్రత్యేక అర్హతలేమీ అవసరం లేదు. మానవత్వంతో స్పందించే ప్రతి ఒక్కరూ రక్తదాత కావచ్చు. వయస్సు 18 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉండాలి. బరువు కనీసం 50 కిలోగ్రాములు ఉండాలి. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు, అంటువ్యాధులు ఉండకూడదు. హిమోగ్లోబిన్ స్థాయి కనీసం 12.5 గ్రాములు ఉండాలి. పురుషులు ప్రతి మూడు నెలలకు ఒకసారి, మహిళలు ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు.

ప్రాణదానానికి మొదటి బాట



రక్తదానంపై అపోహలను నమ్మవద్దు ఆధునిక వైద్య విధానంలో రక్తదానం 100శాతం సురక్షితం. ప్రతి దాత భద్రతను నిర్ధారించుకున్నాకే రక్తాన్ని స్వీకరిస్తాం. 18 ఏళ్లు వయసు దాటిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలి. నిజానికి, క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల శరీరంలో అధిక ఐరన్ నిల్వలు తగ్గి గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. పాత రక్తకణాల స్థానంలో కొత్తవి ఏర్పడి, శరీరానికి నూతనోత్తేజం లభిస్తుంది. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ దీనిని ఒక సామాజిక బాధ్యతగా భావించి ముందుకు రావాలి.

– డాక్టర్. జి.నాగభూషణరావు, డీసీహెచ్ఎస్, పార్వతీపురం మన్యం జిల్లా

శతక దానానికి ఒక్క అడుగు దూరం



మన ఇంట్లో వారికి రక్తం అవసరమైతే ఎంత ఆరాటపడతామో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. బ్లడ్ బ్యాంకులో మనకు తెలియని వారెందరో అదే ఆరాటంతో ఎదురు చూస్తున్నారు. అక్కడ ప్రాణాలతో పోరాడుతున్నది ఎవరో కాదు. మన లాంటి మనుషులే. ఇప్పటికి స్వచ్ఛందంగా ప్రత్యక్ష రక్త దాతగా ధైర్యంగా 99 సార్లు ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేశాను. యువత ముఖ్యంగా రక్తదానానికి ముందుకురావాలి. పుట్టినరోజున రక్తదానం చేసి ఆ రోజును మరపురానిదిగా చేసుకునే మంచి ఆలోచనలు యువతలో రావాలి.

– బోటు రామకృష్ణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, పార్వతీపురం

యువత ముందుకు రావాలి



రక్త నిల్వలు పూర్తిగా తగ్గుముఖం పట్టకుండా ఉండాలంటే యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేయాలి. రక్తం అందక ఎవరూ చనిపోకూడదనే ఉద్దేశంతో యువతకు అవగాహన కల్పించి శిబిరాలు నిర్వహిస్తున్నాం. రక్తదానం కుటుంబ సంప్రదాయంలా మారాలి. నేను ఇప్పటివరకు 32 సార్లు రక్తదానం చేశాను.

– పెంకి చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ సభ్యుడు, రాజాం

రక్తదానం ఒక బాధ్యత..



ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం బాధ్యతగా చేస్తుంటాను. ఇప్పటి వరకు శిబిరాల ద్వారా, స్వచ్ఛందంగా 53 సార్లు రక్తదానం చేశాను. ఆపదలో ఉన్నవారికి ఇలా ఉపయోగపడడం చాలా సంతోషంగా ఉంది. ఎప్పుడైనా ఎవరికైనా ఏ సమయంలో అవసరమైనా రక్తం ఇచ్చేందుకు నేను సిద్ధం.

– శనపతి రాము, రక్తదాత, పొగిరి

రక్తం ఎంతో విలువైనది



రక్తం ఎంతో విలువైనది. ప్రమాదాలు, శస్త్రచికిత్సల వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. యువత స్ఫూర్తితో ముందుకు వచ్చి రక్తదానం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అలాగే రక్తదానం చేయడం ద్వారా కొత్త రక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుంది.

– కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, రాజాం

కూటమి పాలనలో అరాచకాలు, అవినీతి దాడులు


డిజిటల్ బుక్ యాప్ పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్, తదితరులు

- బాధితుల కోసమే డిజిటల్ బుక్
- డిజిటల్ బుక్ పోస్టర్లు విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ

చీపురుపల్లి: కూటమి ప్రభుత్వం పదహారు నెలల పరిపాలనలో అక్రమాలు, అవినీతి, అరాచకాలు, దాడులు, అక్రమ కేసులు తప్ప ఇంకేం లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్‌లు అన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు, దాడులకు బలవుతున్న బాధితులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన డిజిటల్ బుక్ యాప్‌కు సంబంధించిన పోస్టర్లను మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదహారు నెలల్లో పరిపాలన విషయంలో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం తమకు ఓట్లు వేసిన ప్రజల ముందు నిలబడాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కూటమి ప్రభుత్వం విఫలమైన తీరును, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న అవినీతి, అక్రమాలను ప్రజలు, ప్రభుత్వం దృష్టికి సోషల్ మీడియా తీసుకువెళ్తున్న తీరును జీర్ణించుకోలేని ప్రభుత్వం సోషల్ మీడియా కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తూ, దాడులు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అందుకనే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ అనే యాప్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. సోషల్ మీడియా కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజలు, నాయకులు ఎవరైనా కూటమి ప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటే ఆ డిజిటల్ బుక్ యాప్‌లో తమ కష్టాలు, వివరాలు నమోదు చేయాలని సూచించారు.

అసలైన సైకో బాలకృష్ణ

అసలు సిసలైన సైకో, ఎర్రగడ్డ ఆస్పత్రి నుంచి ధ్రువీకరణ పొందిన బాలకృష్ణ వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అనడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న అరాచకాలకు పోలీస్ వ్యవస్థ కూడా వంతపాడడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ.సూర్యనారాయణరాజు, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల నాయకులు ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, తాడ్డి వేణు, కోట్ల వెంకటరావు, మీసాల విశ్వేశ్వరరావు, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ఇచ్చిన మాటను చంద్రబాబు, లోకేష్ నిలబెట్టుకోవాలి

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు తదితరులు

గజపతినగరం: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి లిఫ్ట్ కాలువ నుంచి విజయనగరంలోని వెదురు వాడ తాటిపూడి ఎక్స్‌టెన్షన్ బాలెన్స్ రిజర్వాయర్ తరువాత ఎక్కడా బాలెన్సింగ్ రిజర్వాయర్ లేదని దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లాకార్యదర్శి బి.రాంబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం గజపతినగరం మండలం పురిటి పెంట గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు బొండపల్లి సభలోను, అలాగే నారాలోకేష్ గంట్యాడ మండలంలో జరిగిన సభలోను ఎలైన్ మెంట్ పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గం పరిశీలిస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికీ ఇచ్చిన ఆ మాటను తండ్రీకొడుకులు నిలబెట్టు కోలేదన్నారు. గుమడాం గ్రామం నుంచి కోటగండ్రేడు వరకు కాలువ లోలెవెల్లో తీసుకుని పోయి అక్కడి నుంచి ఐదు లిఫ్టల ద్వారా నీరు పంప్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు. జిల్లాలోని మెట్టప్రాంతాలకు సాగునీరందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలవరం ఎడమ కాలువ పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ చల్లా జగన్, గంట్యాడ మండలం పోరాట కమిటీ కన్వీనర్ కోడెల శ్రీను, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తొత్తడి పైడిపు నాయుడు, రైతు సంఘం నాయకులు డుదేవర జగన్, దాసరి సింహాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు రాకోటి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు 600 మందితో బందోబస్తు


భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత తొలిసారి సీఎం చంద్రబాబు రాష్ట్ర ఎన్ఆర్ఐ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు మండలం దత్తి గ్రామానికి వస్తున్న సంగతి విదితమే. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించేందుకు మంత్రి కొండపల్లి ఆధ్వర్యంలో రాష్ట్ర హోంమంత్రి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిలు మంగళవారం పింఛన్లు పంపిణీ చేసే సభా ప్రాంగణాన్ని ఎస్పీ దామోదర్ ,ఏఎస్పీ సౌమ్యలతలతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు భద్రతా ఏర్పాట్ల రూట్ మ్యాప్‌లను దగ్గరుండి మంత్రులకు ఎస్పీ దామోదర్ చూపించారు. దాదాపు 600 మంది సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ దామోదర్ ఈ సందర్భంగా వివరించారు. సభాస్థలం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, మీటింగ్ స్థలం, కార్యకర్తలతో సమావేశ స్థలం, పార్కింగ్ స్థలాలు, కాన్వాయ్ వెళ్లే మార్గాలను క్షేత్రస్థాయిలో ఎస్పీ దామోదర్ పర్యవేక్షించారు. బందోబస్తు, భద్రత విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించే విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు, మహిళా పీఎస్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే గిరిజనుల సంక్షేమం

- విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం బబిత


చినమరికిలో న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

పార్వతీపురం రూరల్: భారత రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన ప్రత్యేక హక్కులు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే వారి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత ఉద్ఘాటించారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మండలంలోని చినమరికి గ్రామంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల సామాజిక, ఆర్థిక సాధికారిత కోసం ఎన్నో ప్రణాళికలు, చట్టాలు దేశంలో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న బాల్య వివాహాలపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, 18ఏళ్ల వయస్సు దాటాకే వారు శారీరకంగా, మానసికంగా పరిణతి చెందుతారన్నారు. చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని, ఈ క్రమంలో తక్కువ బరువుతో పిల్లల పుట్టడం, నవజాత శిశు మరణాలు, పోషకాహార లోపాలు వంటి అనేక సమస్యలకు దారి తీస్తుందని ఆమె హెచ్చరించారు.

అడవి, భూమిని కాపాడుకోవాలి

ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు మాట్లాడుతూ గిరిజనుల జీవనానికి, సంస్కృతికి ఆధారమైన అడవి, భూములను కాపాడుకోవడానికి ప్రభుత్వాలు కల్పించిన హక్కులు ఎంతగానో తోడ్పడతాయన్నారు. తమ హక్కుల గురించి ప్రతి ఒక్కరూ అవగాహనతో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, పార్వతీపురం అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్య జోష్ఫిన్, పార్వతీపురం రూరల్ సీఐ రంగనాథం, ఎస్సై సంతోషికుమారి, తహసీల్దార్ సురేష్, లోక్ అదాలత్ సభ్యులు జోగారావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, స్థానిక సర్పంచ్ గంగ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు నష్టం జరిగే చర్యలు విరమించుకోవాలి

విజయనగరం: మత్స్యకారులకు నష్టం కలిగించే చర్యలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు బర్రి చిన్నప్పన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని రాజయ్యపేట గ్రామం నక్కపల్లి మండలం బల్క్ డ్రగ్స్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక మత్స్యకారులు 15రోజుల నుంచి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. రాష్ట్ర హోంమంత్రి అనిత సొంత నియోజకవర్గంలో ఇలాంటి పరిశ్రమను మత్స్యకారుల పొట్టకొట్టే విధంగా ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో బల్క్ డ్రగ్స్ పార్కు ఏర్పాటు చేస్తే మత్స్యకారుల జీవనానికి విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. పార్కును వ్యతిరేకిస్తూ ఉద్యమం చేసిన వారిపై తప్పుడు కేసులు పెడితే మత్స్యకారులకు అండగా రాష్ట్రవ్యాప్తంగా సహకార సంఘాలు అండగా నిలుస్తాయని చెప్పారు. ప్రభుత్వం దుష్ట చర్యలకు పాల్పడకుండా తక్షణమే తీరప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం ఆలోచన విరమించుకోవడంతో పాటు మత్స్యకారులపై కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక బకాయిలు చెల్లించండి

విజయనగరం అర్బన్: ఉద్యోగుల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్ నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఏపీటీఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీసం 30 శాతం మధ్యంతర భృతి అమలు చేయాలని కోరారు. ఉమ్మడి సర్వీసుల సమస్య పరిష్కరించాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. సీఆర్‌పీ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. మున్సిపల్, మోడల్ స్కూల్, కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.బలరామనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎ.సదాశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ధనంజయరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆర్.కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వి.పైడిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.వెంకటనాయుడు, వై.మధుసూదనరావు, జిల్లా సహాధ్యక్షులు ఎస్.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లకే నిండిన నూరేళ్లు

- బస్సు ఢీకొని బాలిక మృతి


కుమార్తెను భుజంపై మోసుకెళ్తున్న చిన్నారి తండ్రి మోహనరావు


ద్రాక్షాయణి మృతదేహం

రాజాం సిటీ: అప్పటి వరకు సరదాగా చిట్టిపొట్టి మాటలు ఆడుతూ తల్లిదండ్రులతో పాటు ద్విచక్ర వాహనంపై వెళ్లిన ఆ చిన్నారిని బస్సు రూపంలో మృత్యువు కబళించింది. దసరా ఎంతో సంతోషంగా జరుపుకోవాలని భావించిన ఆ కుటుంబంలో విషాదం నిండింది. ఆరేళ్లకే నూరేళ్లు నిండిపోయాయా అంటూ పెట్టిన తల్లిదండ్రుల రోదన స్థానికులను కలిచివేసింది. ఎంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమార్తె కళ్లెదుటే మృతిచెందడంతో జీర్ణించుకోలేక గుండెలవిసేలా తల్లిదండ్రులు రోదించారు. ఈ హృదయ విదారక ఘటన రాజాంలో మంగళవారం జరిగింది. దీనిపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు..రేగిడి మండలం బూరాడ గ్రామానికి చెందిన లుకలాపు మోహనరావు మెకానిక్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. భార్య ఇందు, కుమార్తె ద్రాక్షాయణి(6)తో కలిసి ద్విచక్రవాహనంపై బొద్దాం నుంచి రాజాం వస్తున్నారు. అదే సమయంలో బొబ్బిలి నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బొబ్బిలి జంక్షన్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారి అక్కడికక్కడే మృతిచెందింది. రెండో వైపు పడిపోయిన చిన్నారి తల్లిదండ్రులు వెంటనే తేరుకుని కుమార్తెను చూసి ఒక్కసారిగా భోరున విలపించారు. తన కుమార్తెకు ఏమీ కాదని దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి చిన్నారిని మోసుకుంటూ తండ్రి తీసుకువెళ్లిన దృశ్యం చూసిన స్థానికులు అయ్యో పాపం అంటూ నిట్టూర్చారు. చిన్నారి మృతితో బూరాడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై రమణమూర్తి తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడి ఆత్మహత్య


సతీష్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన సీతారాపు సతీష్(25) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి తండ్రి సీరాపు శ్రీరాములు అందించిన వివరాలిలా ఉన్నాయి. కుమారుడు సతీష్ ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు తల్లిదండ్రులు నిరాకరించిన కారణంగా మనస్తాపానికి గురై పురుగు మందు తాగేశాడు. దీంతో చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. సతీష్ సాలూరు ఆర్టీసీ డిపోలో కాంట్రాక్ట్ పద్ధతిన డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

యువకుడి ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన ప్రదీప్

శృంగవరపుకోట: మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన గోకాడ ప్రదీప్(24) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గోకాడ బాపు నాయుడు కొడుకు ప్రదీప్ కొంతకాలంగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో నెట్‌వర్క్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం గ్రామానికి వచ్చిన ప్రదీప్ అందరితో కలివిడిగా ఉన్నాడు. సోమవారం సాయంత్రం వరకు సన్నిహితులు, స్నేహితులతో సరదాగా గడిపి సోమవారం రాత్రి తన ఇంటి మేడపైన గదిలో చున్నీతో ఉరిపోసుకున్నాడు. స్థిరమైన ఉద్యోగం లేదన్న మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. మృతుడు ప్రదీప్‌కు తండ్రి, తల్లితో పాటు పెళ్లైన అక్క ఉన్నారు.